క్లుప్తంగా

క్రీడలతో మానసిక ఉల్లాసం



సీఐ గంగాధర్‌ను సత్కరిస్తున్న క్రీడాకారులు

గోనెగండ్ల : క్రీడల్లో రాణించే వారికి మంచి భవిష్యత్‌తో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని సీఐ గంగాధర్ అన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా గోనెగండ్ల క్రీడాకారులు మండల కేంద్రం గోనెగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ క్రికెట్ పోటీలను సీఐ గంగాధర్ క్రీడాకారులతో కలిసి ఆదివారం ప్రారంభించారు. సీఐ మాట్లాడుతూ క్రీడకారులను ప్రోత్సహించేందుకు గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి పోటీలు నిర్వహించడం అభినందించాల్సిన విషయం అన్నారు. క్రీడపోటీల్లో పాల్గొనే వారు గెలుపోటములను సహజంగా తీసుకొని స్నేహభావంతో ఆడాలన్నారు. కార్యక్రమంలో క్రీడకారులు మనోజ్, కళ్యాణ్, ఖాజా, వేణు తదితరులు పాల్గొన్నారు.

నిరాశ్రయులకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు, స్వెట్టర్‌లను పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్, సభ్యులు

ఆదోని అర్బన్: ఆదోని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని నిరాశ్రయులకు దుప్పట్లు, స్వెట్టర్‌లను పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ డాక్టర్ గోపీనాథ్, పట్టణాధ్యక్షుడు ప్రసాదరావు, ధర్మారెడ్డి మాట్లాడుతూ అర్ధ రాత్రి చలిలో వణుకుతూ రోడ్డు పక్కన, ఆలయాలు, రైల్వేస్టేషన్, బస్‌స్టేషన్ ఆవరణలో సేద తీరుతున్న నిరాశ్రయులకు దుప్పట్లను అందజేసినట్లు చెప్పారు. దాదాపు 200 దుప్పట్లను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు శ్రీనాథ్ గుప్తా, వనపరాజు, మాస్టర్ అద్వైత్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్యారతారిఖ్ వేడుకలు



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న భక్తులు

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాలో ఆదివారం గ్యారతారిఖ్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ఫాతెహాలు సమర్పించి ప్రార్థనలు జరుపుకున్నారు. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్తీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాలను చేపట్టారు. భక్తులు పిండి వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించారు. వచ్చిన భక్తులందరికి ధర్మకర్త అన్నదానం ఏర్పాటు చేశారు.

వైభవంగా అంబాభవాని ప్రభోత్సవం



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కోసిగి: మండల పరిధిలోని ఆర్లబండ గ్రామ ప్రజల ఆరాధ్య దైవం శ్రీ అంబాభవాని దేవికి ఆదివారం వేకువజామున నుంచి ఆలయ పీఠాధిపతులు శ్రీ మఠ్రిస్వాములు ఆధ్వర్యంలో జలాభిషేకం, కుంకుమార్చన, వెండికవచ అలంకరణలు గావించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ప్రతిమను ప్రభపై కొలువుంచి మేళతాళాల మధ్య ప్రభోత్సవం నిర్వహించారు. సోమవారం సాయంత్రం వేలాది మంది భక్త జనసందోహం మధ్య రథోత్సవం నిర్వహించనున్నారు. సాయంత్రం గ్రామంలోని మేటి గౌళ్ల ఇంటి నుంచి పూర్ణకుంభాన్ని మేళతాళాలు, డప్పు వాయిద్యాలతో పురవీధుల గుండా ఊరేగింపుగా ఆలయం చెంతకు చేరుకుని, అక్కడ పూజలు నిర్వహించనున్నారు. అనంతరం పూర్ణకుంభాలతో రథం వద్దకు వచ్చి అక్కడ పీఠాధిపతి మఠ్రి స్వాములు ఆధ్వర్యంలో పూజలు చేసి రథోత్సవానికి అంకురార్పణ పలుకనున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తాదులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉచిత భోజన వసతి ఏర్పాటు చేశారు.

నేడు టమాట విక్రయాలు బంద్

పత్తికొండ(తుగ్గలి) : సంక్రాంతి పండుగ పురస్కరించుకొని సోమవారం పత్తికొండ మార్కెట్‌యార్డులో టమాట విక్రయాలు నిలిపివేసిన ట్లు మార్కెట్ యార్డు కార్యదర్శి కార్నోలిస్ ఆదివారం తెలిపారు. పశువుల సంత యథావిధిగా జరుగుతుందని, కేవలం టమాట విక్రయాలు మాత్రమే జరగవన్నారు. టమాట రైతులు గమనించాలని కోరారు.

అభయ మొసగే దేవుడు..
రామలింగేశ్వరుడు

- నేటి నుంచి రాంపురంలో ఉత్సవాలు
- నేడు అంకురార్పణ సేవ
- 15న మహారథోత్సవం
- ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు



రథయాత్రకు సిద్ధం చేస్తున్న మహారథం

మంత్రాలయం : ఆరాధ్యులకు అభయ మొసగే దేవుడు.. కొలిచే వారి కల్పతరువు శ్రీ రామలింగేశ్వరుడు. మంత్రాలయం మండలం రాంపురం గ్రామం పవిత్ర తుంగభద్ర నది ఒడ్డున రామలింగేశ్వరుడు వెలిశాడు. గురువారం నుంచి రాంపురం సోదరులు మాజీ టీటీడీ పాలక మండలి సభ్యుడు వై.సీతారామిరెడ్డి, ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆధ్వర్యంలో వైభవంగా వేడు



శ్రీ రామలింగేశ్వరస్వామి దేవాలయం,(ఇన్‌సెట్) రామలింగేశ్వర స్వామి మూలవిరాట్

కను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

ఆలయ చరిత్ర

అలనాడు శ్రీరాముడు అరణ్యవాసం చేస్తూ తుంగానది తీరంలో పర్యటించారు. ప్రాతఃకాల పూజ నిమిత్తం సైకత లింగాన్ని ప్రతిష్ఠించి పూజలు గావించారు. శ్రీరాముడుచే ప్రతిష్ఠబడిన లింగమే రామలింగేశ్వరుడిగా అవతరించాడని ప్రతీతి. ఏటా సంక్రాంతి పర్వం కనుమ రోజున రామలింగేశ్వరుడి జాతర, మహారథోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఉత్సవ విశేషాలు

శ్రీరామలింగేశ్వరుడి వేడుకలు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. సోమవారం నుంచి గురువారం వరకు ఉత్సవాలు నిర్వహించనున్నారు. సోమవారం అంకురార్పణసేవ, మంగళవారం పల్లకీసేవ, బుధవారం కల్యాణోత్సవం, రాత్రి మహారథోత్సవం జరగనుంది. జాతర సందర్భంగా గ్రామంలో యువకులు కోలాటాలు, క్రీడాపోటీలు, భజనలు నిర్వహిస్తారు. జాతర మహోత్సవానికి పలువురు ఎంపీలు, రాంపురం సోదరులు ఆదోని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, గుంతకల్ మాజీ ఎమ్మెల్యే వెంకట్రామిరెడ్డితోపాటు పలువురు ఎమ్మెల్యేలు హాజరుకానున్నారు.

అందరూ ఆహ్వానితులే



శ్రీరామలింగేశ్వరస్వామి మా ఊరి దైవం. జాతర మహోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేశాం. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నాం. రథయాత్రను పురస్కరించుకుని ఆలయానికి రంగులద్ది విద్యుద్దీపాలంకరణ గావించాం. ఉత్సవానికి అందరూ ఆహ్వానితులే. పలు సాంస్కృతిక కార్యక్రమాలుతో పాటు భోజన వసతి కల్పించాం. ప్రజలు తరలివచ్చి వేడుకను విజయవంతం చేయాలని కోరుతున్నాం.

– వై.బాలనాగిరెడ్డి, ఎమ్మెల్యే

నేడు అంతర్రాష్ట్ర ఎద్దుల గిరక పోటీలు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని గుడేకల్ గ్రామంలో సంక్రాంతి పండగను పురస్కరించుకొని వై.సి. వీరభద్రగౌడ్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం అంతర్రాష్ట్ర ఎద్దుల గిరక పోటీలను జరగనున్నట్లు నిర్వహకులు ఆదివారం సాయంత్రం ఓ ప్రకటనలో తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ.30 వేలు, రెండవ బహుమతి రూ. 25 వేలు, మూడవ బహుమతి రూ. 20 వేలు, నాల్గవ బహుమతి రూ. 15 వేలు, ఐదవ బహుమతి రూ. 10 వేలు, ఆరవ బహుమతి రూ. 8 వేలు, ఏడవ బహుమతి రూ.5 వేలు అందజేస్తామన్నారు.

నేడు ఉరుకుందలో రుద్ర హోమం

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయంలో సోమవారం రుద్ర హోమం నిర్వహిస్తున్నట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు తెలిపారు. హోమంలో పాల్గొనదలచిన వారు ముందుగానే రూ.1,500 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఆసక్తి కలిగిన భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. హోమంలో పాల్గొన్న భక్తులకు దేవస్థానం తరుపు శేషవస్త్రం, రవిక, స్వామివారి ఫొటో, దేవాస్థానం పేరున్న బ్యాగ్, దేవస్థానం లడ్డు బాక్స్‌లో రెండు లడ్డు ఉంచి ఇస్తామన్నారు.

సొళ్లహాళ్లిలో ఎమ్మెల్యే పర్యటన



షెడ్డు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, నాయకులు

మంత్రాలయం: మండల పరిధిలోని సొళ్లహాళ్లి గ్రామంలో ఆదివారం మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పర్యటించారు. ముందుగా గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యే బోయ ఈరన్న అనే రైతు నూతనంగా నిర్మించుకున్న గోకుళం షెడ్డును ప్రారంభించారు. అనంతరం అదే కాలనీల్లో విద్యుత్, డ్రైనేజీ సమస్యలు ఉన్నాయని గ్రామస్తులు ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి దృష్టికి తీసుకుని రాగా వెంటనే సమస్యలను పరిష్కారించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షులు జి.భీమారెడ్డి, ఇన్‌చార్జ్ సి.వి.విశ్వనాథ్‌రెడ్డి, ఎంపీడీఓ శోభారాణి, సర్పంచ్ రాధ, ఎంపీటీసీ ఈరన్న, నాయకులు బూదూరు మల్లికార్జున రెడ్డి, సత్యనారాయణరెడ్డి, నర్సిరెడ్డి, సాయినాథ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ అభివృద్ధికి కృషి



వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శివప్పగౌడ్‌ను సన్మానిస్తున్న నాయకులు, కార్యకర్తలు


నందవరం : వైఎస్సార్‌సీపీ అభివృద్ధికి, పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తానని పార్టీ మండల కన్వీనర్‌గా ఎంపికైన శివప్పగౌడ్ అన్నారు. ఆదివారం వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులుగా ఎంపికైన శివప్ప గౌడ్‌ను జెడ్పీటీసీ నిఖిల్ చక్రవర్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు దేవేంద్రరెడ్డి, ముగతి గ్రామ సర్పంచ్ విరూపాక్షిరెడ్డి, ఎంపీటీసీ పురుషోత్తం రెడ్డి, పూలచింత మాజీ సర్పంచ్ సురేష్‌గౌడ్, రమేశప్పగౌడ్, దత్తత్రేయ గౌడ్, ఎల్లాగౌడ్‌లు శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడిగా శివప్ప గౌడ్‌ని మరొసారి నియమించడంపై ఆ పార్టీ శ్రేణుల్లో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఆయన మాట్లాడుతూ..తనను నమ్మి పార్టీ మండల అధ్యక్షుడిగా నియమించిన వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక, మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డికి ధన్యవాదాలు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు భీమన్నగౌడ్, శిల్ప రంగన్న, మాజీ ఎంపీటీసీ నరసింహులు, రాముడు, మీసాల సంపత్‌గౌడ్, ఎంపీటీసీ సామెల్ తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



పట్టుబడిన మద్యంతో ఎక్సైజ్ సీఐ భార్గవ్ రెడ్డి, ఎస్ఐ కార్తీక్ సాగర్

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని ఎన్టీఆర్ కాలనీకి చెందిన కె. రాఘవేంద్ర అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తుండగా దాడులు చేసి పట్టుకున్నట్లు కోసిగి ఎక్సైజ్ సీఐ భార్గవ్ రెడ్డి, ఎస్ఐ కార్తీక్ సాగర్ తెలిపారు. ఆదివారం జంపాపురం గ్రామ పరిసరాల్లో పర్యటిస్తుండగా తుంబిగనూరు గ్రామం నుంచి జంపాపురం వంకలో బైక్‌పై కర్ణాటక మద్యం తరిస్తుండగా పట్టుకున్నామన్నారు. అతని వద్ద నుంచి 960 ఒరిజనల్ ఛాయిస్ డీలక్స్ విస్కీ 90ఎంఎల్ టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. వాటి విలువ రూ.65వేలు చేస్తుందన్నారు. అలాగే హోండా సీబీ షైన్ బైక్ (ఏపీ 21 బీడీ 7090)ను సీజ్ చేసి కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ కె. నాగరాజు, కిశోర్ కుమార్, కానిస్టేబుట్ మునిరంగడు, భరత్, రవికుమార్ పాల్గొన్నారు.



గురువులతో పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఆదోని సెంట్రల్: పట్టణంలోని సెయింట్ అంథోని పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 2010-11వ సంవత్సరానికి చెందిన విద్యార్థులు వెదవ్యాస్, రాజశేఖర్, ఆదినారాయణ,లింగప్ప, వీరప్రతాప్, రామాంజి, వీరేంద్ర, లక్ష్మీ, రోజా, దనలక్ష్మీ , లీలావతి తదితరుల ఆధ్వర్యంలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. తమ తోటి మిత్రులతో కలసి చేసిన అల్లరి, ఆట పాటలను గుర్తు చేసుకున్నారు. పాఠశాలను కలియ తిరిగి తమ చిన్ననాటి చిలిపి చేష్టలను జ్ఞాపకం చేసుకున్నారు. అనంతరం ఫాదర్స్ జాన్ డేవిడ్, ప్రసన్న, ఇన్నారెడ్డి తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు కేశవయ్య, చిన్నప్ప, లక్ష్మన్న, నరసన్న, భారతి, శాయ్యూల్ లను సన్మానించారు.

జాతరకు ఎమ్మిగనూరు ముస్తాబు



సోమప్ప సర్కిల్‌కు రంగులు వేస్తున్న దృశ్యం



లైటింగ్ వ్యవస్థను సరిచేస్తున్న మున్సిపల్ సిబ్బంది

ఎమ్మిగనూరుటౌన్: నీలకంఠేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు, మహారథోత్సవాన్ని పురస్కరించుకోని పట్టణం ముస్తాబవుతోంది. సోమవారం నుంచి ఉత్సవాలు ప్రారంభంకానుండగా మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేపట్టారు. స్థానిక సోమప్ప సర్కిల్ చుట్టూ పెయింటింగ్ వేయించడంతో పాటు సర్కిల్ నుంచి పట్టణంలోకి వెళ్లే నలువైపులా ఉన్న డివైడర్‌లకు పెయింటింగ్ పనులు చేయిస్తున్నారు. అదేవిధంగా ఇప్పటికే సెంట్రల్ లైటింగ్ స్తంభాలకు ఎల్ఈడీ లైట్లు వేయించడంతో రాత్రి పూట చూపరులను ఆకట్టుకుంటోంది. సోమప్ప సర్కిల్‌తో పాటు గాంధీ సర్కిల్, సోమేశ్వర థియేటర్ వద్ద కూడళ్లలో శుభ్రం చేయించి వాటర్ ఫౌంటెన్లు పనిచేసేలా చర్యలు తీసుకున్నారు. డివైడర్లతో పాటు పట్టణంలోని పార్క్‌లను అభివృద్ధి చేసి పారిశుధ్య పనులను చేపట్టారు. మహారథోత్సవం రోజు ఎల్ఈడీ స్క్రీన్‌లను ఏర్పాటు చేసి రథోత్సవాన్ని డ్రోన్ కెమెరాల ద్వారా భక్తులు తిలకించేలా నిర్వాహకులు ఏర్పాట్లు చేయనున్నారు. కాగా పట్టణంలోని రోడ్ల పునర్నిర్మాణం, కొన్ని చోట్ల ప్యాచ్ వర్క్‌లను కూడా చేపట్టి భక్తులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకున్నట్లు కమిషనర్ తెలిపారు.

ఆదర్శప్రాయుడు స్వామి వివేకానంద



ఎమ్మిగనూరు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వివేకానందుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్, పట్టణ అధ్యక్షుడు



ఆదోనిలో స్వామి వివేకానంద చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న యువ సంకల్ప సభ్యులు, న్యాయవాదులు

ఆదోని రూరల్: స్వామి వివేకానంద ఆదర్శప్రాయుడని సీనియర్ న్యాయవాదులు నెట్టెకంటయ్య, యువ సంకల్ప అధ్యక్షుడు బి.వీరేష్ అన్నారు. ఆదివారం ఆదోనిలోని రెవెన్యూ భవన్‌లో స్వామివివేకానంద జయంతి సందర్భంగా యువ సంకల్పం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బి.వీరేష్ మాట్లాడుతూ యువత చెడు మార్గాల్లో వెళ్లకుండా మంచి మార్గాన్ని ఎంచుకుని దేశాభివృద్ధికి తోడ్పాటునందించాలన్నారు. కార్యక్రమంలో యువ సంకల్పం సభ్యులు, ఈరప్ప, రామ్ నెట్ కమ్ వీరేష్, కళ్యాణ్, సీనియర్ న్యాయవాదులు భాస్కర్‌రెడ్డి, సోమశేఖర్, వెంకటేశ్వర్లు, రామలింగ తదితరులు పాల్గొన్నారు.

యువజన వారోత్సవాలు

ఆదోని అర్బన్: భారతీయ జనతా యువమోర్చా ఆధ్వర్యంలో ఈనెల 23వ తేదీ వరకు దేశవ్యాప్తంగా యువజన వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షులు కునిగిరి నీలకంఠ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విట్టా రమేష్ తెలిపారు. ఇందులో భాగంగా ఆదివారం బీజేవైఎం కమల్ కప్-2025 పేరుతో ఆదోని పట్టణంలోని స్థానిక జీవేశ్వర పాఠశాల మైదానంలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. ముందుగా భరతమాతకు పూజలు నిర్వహించిన అనంతరం స్వామి వివేకానంద, నేతాజీ చిత్రపటాలకు పూలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా క్రికెట్ పోటీలను వారు ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు అంజయ్‌కుమార్, ఉపేంద్రకుమార్, మధుసూదన్ శర్మ, సురేష్, మహాదేవ తదితరులు పాల్గొన్నారు.

ఆదోని సెంట్రల్: స్వామి వివేకానంద బోధనలను స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఒక్కరు నడవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు వీరేష్ నాగరాజు పిలుపునిచ్చారు. జాతీయ యువజన దినోత్సవం పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమములో నాయకులు భరత్ కుమార్, నాగరాజు, సంజయ్, వెంకటేశులు, సతీష్ కుమార్, పవన్, సంతోష్, వెంకట్, ఉత్తేజ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా యువజన దినోత్సవం

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలో ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, విశ్వహిందు పరిషత్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని ఆదివారం యువజన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ముందుగా వివేకానందుడి చిత్రపటానికి పూలమాల వేసిన నివాళులర్పించారు. విశ్వహిందు పరిషత్ ఆధ్వర్యంలో గ్రామంలో యువకులతో ర్యాలీ నిర్వహించారు. విశ్వహిందు పరిషత్ జిల్లా కార్యదర్శి మారుతీమోహన్, కౌతాళం సింగల్ విండో మాజీ ఉపాధ్యక్షుడు వెంకటపతిరాజు, రాజనందు, పలువురు యువకులు పాల్గొన్నారు.

యువత జాగృతం కావాలి



నందవరంలో వివేకానంద చిత్రపటానికి నివాళి

నందవరం : మండల కేంద్రం నందవరంలో స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని ఆదివారం జాతీయ యువజన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ధీరలింగేశ్వరుడి దేవాలయం సమీపంలో స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వేడుకల్లో వక్తలు, పార్టీలు, సంఘాల నేతలు మాట్లాడుతూ.. యువతకు స్వామి వివేకానంద జీవితం ఆదర్శనీయమని వివరించారు. యువత ఆయన మార్గంలో పయనించి ఉన్నత లక్ష్యాలను అధిరోహించాలన్నారు. వేడుకల్లో బీజేపీ మండల అధ్యక్షుడు మఠం రాజశేఖర్, సంఘాల నాయకులు అయ్యప్ప రెడ్డి, చంద్రగౌడ్, గవ్వల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వామి వివేకానంద జయంతి

ఎమ్మిగనూరుటౌన్: యువజన ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో స్వామి వివేకానందుడి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయన చిత్రపటానికి మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు, పార్టీ పట్టణ అధ్యక్షుడు కామర్తి నాగేషప్ప పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, పార్టీ ఆర్గనైజింగ్ కార్యదర్శి యూకే రాజశేఖర్, పార్టీ చేనేత విభాగ జిల్లా అధ్యక్షుడు ఎంకే శివప్రసాద్, జిల్లా అధికార ప్రతినిధి సునీల్‌కుమార్, ఎల్లెల్సీ మాజీ డైరెక్టర్ గడ్డం నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేకు ధన్యవాదాలు



మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న పట్టణ అధ్యక్షుడు కామర్తి నాగేషప్ప

ఎమ్మిగనూరుటౌన్: వైఎస్సార్‌సిపి పట్టణ అధ్యక్షుడిగా నియమితులైన మున్సిపల్ ఒకటవ వార్డు కౌన్సిలర్ కామర్తి నాగేషప్ప ఆదివారం మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డిని ఆయన నివాసంలో కలిసి పూల బొకె ఇచ్చి ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా పార్టీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డిని కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్ అహమ్మద్, జిల్లా నాయకులు ఎంకే శివప్రసాద్, యూకే రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

ఆదోని సెంట్రల్: మహారాష్ట్రకు చెందిన లక్ష్మణ్ తాటోబ సిందే కడప నుంచి షోలాపూర్‌కు వెళ్తూ ప్రమాదావశాత్తు రైలు నుంచి జారి పడి మృతి చెందినట్లు ఆర్ఎస్ఐ గోపాల్ తెలిపారు. మృతుడు రైలు నంబర్ 12164లో ప్రయాణం చేస్తూ మంత్రాలయం ఆర్ఎస్ పీఎఫ్ నంబర్ 02, రోడ్డు నంబర్ 03 మధ్య కిలోమీటరు నంబర్ 535/12 డౌన్‌లైన్ ట్రాక్ వద్ద రైలు నుంచి జారిపడ్డాడని చెప్పారు. తీవ్రమైన గాయాలు కావడంతో మృతుడు అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. మృతుడి ఆధార్ కార్డును బట్టి లక్ష్మణ్ తాటోబ సిందే, బామ్‌బ్రెడ్ గ్రామం, సంగాలి జిల్లా మహారాష్ట్రకు చెందిన వ్యక్తిగా గుర్తించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. తండ్రి మరణంపై ఎలాంటి అనుమానాలు లేవని లక్ష్మణ్ తోటో కుమారుడు నిలేష్ తెలిపాడన్నారు.

ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి



ఏకగ్రీవంగా ఎన్నికైన వారిని అభినందిస్తున్న సీపీఐ నాయకులు

ఆదోని రూరల్: ఫిబ్రవరి 6 నుంచి 9వ తేదీ వరకు శ్రీకాకుళంలో జరిగే ఏఐవైఎఫ్ 22వ మహాసభలను జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారుమంచి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.అజయ్‌బాబు, సీపీఐ పట్టణ కార్యదర్శి సుదర్శన్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఏఐవైఎఫ్ కార్యాలయంలో రాష్ట్ర మహాసభల పోస్టర్‌లను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలని, నిరుద్యోగభృతి రూ.3 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వలంటీర్లను యథావిధిగా కొనసాగించి ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. లేనిపక్షంలో ఏఐవైఎఫ్ ఉద్యమాలకు శ్రీకారం చుడుతుందన్నారు. అనంతరం ఏఐవైఎఫ్ పట్టణ అధ్యక్షులు రమేష్‌కుమార్ ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఏఐవైఎఫ్ పట్టణాధ్యక్షుడిగా బసాపురం లింగప్పయాదవ్, ప్రధాన కార్యదర్శిగా గోరుకల్లు అంజిత్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా మల్లికార్జున, సహాయ కార్యదర్శిగా కె.లింగప్ప, వెంకటేశులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

జోరుగా వరినాట్లు



వేముగోడులో వరినాట్లు వేస్తున్న దృశ్యం

మండల కేంద్రం గోనెగండ్లతో పాటు హెచ్. కైరవాడి, పుట్టపాశం, వేముగోడు, పిల్లిగుండ్ల, గాజులదిన్నె, ఐరన్‌బండ, ఎన్నెకండ్ల తదితర గ్రామాల్లో వరి రైతులు పొలాల్లో వరినాట్లు వేసే పనుల్లో బిజీ అయ్యారు. రబీ సీజన్‌లో ఎల్లెల్సీ కాలువ కింద, జీడీపీ కింద, గాజులదిన్నె ప్రాజెక్టు ఎగువ, దిగువ ప్రాంతాల్లో వరి నాట్లు వేస్తున్నారు. సోనా మసూరి, జీలకర సోనా, 65 డీపీ, తెల్లహంస, కర్నూలు సోనా రకాలను రైతులు సాగుచేస్తున్నారు. మండలంలో దాదాపు 200 ఎకరాల్లో వరి నాట్లు వేస్తున్నారు.

–గోనెగండ్ల